క్లుప్తంగా

వన సమారాధన విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శెట్టిబలిజ సంఘ నాయకుడు వాసంశెట్టి సుభాష్

ప్రకాశంనగర్: అమలాపురంలోని సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద ఈ నెల 10న ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ నాయకుడు వాసంశెట్టి సుభాష్ తెలిపారు. బుధవారం స్థానిక కంబాలచెరువు వద్ద ఉన్న బెలూన్ రూమ్ కార్యాలయంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోనసీమ శెట్టిబలిజ కార్తిక వన సమారాధన ఆత్మీయ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల్లోని శెట్టిబలిజలు హాజరు కావాలన్నారు. గత ఏడాది నవంబర్‌లో అమలాపురంలో శెట్టిబలిజ కార్తిక సమారాధన నిర్వహించడంతో దాదాపు 70 వేల మంది వచ్చి సంఘీభావం తెలిపారన్నారు. మరోసారి ఐక్యత చాటేందుకు అంతా కదిలి రావాలన్నారు. మాజీ కార్పొరేటర్ వాసంశెట్టి గంగాధర్ మాట్లాడుతూ శెట్టిబలిజ కార్తిక వన సమారాధనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిన్నింటి ఏకబాబు, కడియాల శ్రీను, పితాని రాజు, కడలి రామకృష్ణ, పిల్లి శ్యామ్, మునసా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ పాలెంలో సంకల్పయాత్ర

కడియం: మాధవరాయుడుపాలెంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర బుధవారం సర్పంచ్ అన్నందేవుల చంటి అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకుడు సోము వీర్రాజు హాజరయ్యారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ వ్యాప్తంగా అమలవుతున్న పథకాలను వివరించారు. హైస్కూల్ హెచ్‌యం ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఎంఈఓ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, బీజేపీ నాయకులు నాగులపల్లి వీరబాబు, బొరుసు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు కీలకం



హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రజల భద్రతకు హోంగార్డుల సేవలు కీలకమని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. 61వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక రైజింగ్ డే పరేడ్‌లో బుధవారం నిర్వహించారు. దీనికి హాజరైన ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు నిస్వార్థ సేవలు అందిస్తున్నారని, అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు సేవా దృక్పథంతో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇందులో కొంతమంది చదువుకున్న వారు పోలీస్ స్టేషన్‌లో టైపిస్టులుగా, కంప్యూటర్ విభాగంలో పనిచేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యం ఏర్పడినప్పుడు సహాయ పడుతున్నారన్నారు. అనంతరం హోంగార్డ్‌లతో ఆయన ముఖాముఖి చర్చించి, వారి సమస్యలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో ఉత్తమ పనితీరు కనబరిచిన పి.రాంబాబు, డి.కామేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, ఎండీ శంకర్, బి.మంగలకు ఎస్పీ ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. అడిషనల్ ఎస్పీలు ఎం.రజిని, చెంచి రెడ్డి, జోనల్ డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: తుపాన్ బాధితులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరులో ముంపునకు గురైన లెప్రసీ కాలనీని బుధవారం రాత్రి ఆయన పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ లెప్రసీ కాలనీలో చేరిన నీటిని మోటార్లతో తోడించి ఇబ్బందులు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి సూచించారు. తక్షణ సాయం కింద 12 కుటుంబాలకు ప్రభుత్వం అందించిన నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రత్నసాగర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక చౌడేశ్వర్‌నగర్‌కు చెందిన కట్టా కుమార్ (44) అదృశ్యంపై స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. తన తమ్ముడు ఈ నెల 3వ తేదీ నుంచి కనిపించడం లేదని అన్నయ్య రవి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధితులను ఆదుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ: తుపాను బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ బుధవారం కోరారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో పంటలు నష్టపోయిన రైతులకు అండగా నిలవాలన్నారు. ఛిద్రమైన రోడ్లను బాగు చేయించాలని అన్నారు.



నగరంలో రోడ్డుపై విరిగిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



కాలువలో పేరుకుపోయిన బురదను తీస్తున్న పారిశుధ్య కార్మికులు



ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్



కడియంలో బాధితులతో మాట్లాడుతున్న గిరజాల బాబు

కదలివచ్చి.. కష్టం తీర్చి

- యుద్ధప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు
- నగరంలో పారిశుధ్య పనులు ముమ్మరం

రాజమహేంద్రవరం సిటీ: మిచాంగ్ తుపాను కష్టం తెచ్చింది.. ఒక్కసారిగా అతలాకుతలం చేసింది.. మంగళవారం భారీ ఈదురు గాలులు, వర్షానికి జరిగిన నష్టాన్ని నివారించే పనుల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో నగరంలో పారిశుధ్య సిబ్బంది స్పందించి వేగంగా పనులు చేస్తున్నారు. జనజీవనానికి ఆటంకం లేకుండా చూస్తున్నారు. నగరంలో విరిగిపడిన చెట్లు తొలగించే పనులను అధికారులు ముమ్మరంగా చేపట్టారు. వర్షపు నీరు రోడ్డెక్కడంతో పేరుకుపోయిన బురదను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. స్ప్రేయర్లతో బురదను తొలగిస్తున్నారు. స్థానిక రాజేంద్రనగర్, దానవాయిపేట, ప్రకాశంనగర్, వీఎల్‌పురం, ఆర్యాపురం, కంబాలచెరువు, పేపరుమిల్లు ఆర్ట్స్ కళాశాల తదితర ప్రాంతాల్లో చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. ఈ చెట్లను రంపాలతో కోసి ఎప్పటికప్పుడు తరలిస్తూ రహదారిపై రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. అదేవిధంగా కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ఉండటంతో వాటిని తొలగించేందుకు జేసీబీతో పనులు చేపట్టారు.



కాతేరులో బాధితులను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్



పిడింగొయ్యిలో సహాయక చర్యల్లో జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ

వేగంగా సహాయక చర్యలు

తుపాను సృష్టించిన నష్టం నుంచి ప్రజలు త్వరితగతిన బయటపడే విధంగా ప్రభుత్వం అధికార యంత్రాంగంతో సహాయక చర్యలు ముమ్మరం చేసిందని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ముంపు బాధితులు అధైర్య పడొద్దని ఆయన భరోసా ఇచ్చారు. బుధవారం నగరంలో వివిధ ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. బాధితులకు రొట్టెలు, పాల ప్యాకెట్లు, ఆహారం తదితరాలు అందిస్తూ ధైర్యం చెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రజలకు అవసరమైన సహాయాన్ని తక్షణం అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ముంపునకు గురైన కోటిలింగాల పేట, కృష్ణానగర్, ఆదెమ్మదిబ్బ, లింగంపేట, తుమ్మలావ, ఆర్యాపురం తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం సహాయక చర్యలు ముమ్మరం చేసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నాయకులు కాటం రజనీకాంత్, దాసి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

స్పందిస్తూ.. సహకారం అందిస్తూ..

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ముమ్మరంగా పనులు చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, తహసీల్దార్ చిన్నారావు, పంచాయతీ కార్యదర్శులు సహాయక చర్యలు చేపట్టారు. హుకుంపేట పంచాయతీ సావిత్రినగర్, చైతన్యనగర్‌లో ముంపు ప్రాంతాల్లో మోటార్లతో నీటిని తోడించారు. పిడింగొయ్యి పంచాయతీ పరిధి బాపూజీనగర్, అరవింద్ నగర్, ఆదిత్య నగర్‌లో నేలకొరిగిన విద్యుత్తు స్తంభాలు సరిచేసి, కూలిన చెట్ల తొలగింపు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు ఎం.రూప్‌చంద్, జి.వెంకటరావు, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు పాల్గొన్నారు. కాతేరు సంజయ్‌గాంధీ నగర్‌లో వర్షం నీటితో మునిగిన గుడిసెలను ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరిశీలించి బాధితులను పరామర్శించారు. బాధితులు రాయిమేరీ, రాయిమార్తా కుటుంబాలకు నిత్యావసరాలు, బియ్యం, కూరగాయలు, ఆర్థిక సాయం అందించారు. వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆచంట కల్యాణ్, పెనుమాక సునీల్, చీకట్ల రంజిత్ తదితరులు పాల్గొన్నారు. వర్షాలకు నీట మునిగిన రైల్వేస్టేషన్ ప్రాంతంతో పాటు పలు ప్రాంతాలను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పరిశీలించారు.

తేలుతున్న నష్టం

కడియం: మిచాంగ్ తుపాను కారణంగా కడియంలో ఒక ఇంటి గోడ కూలిపోయింది. దామిరెడ్డిపల్లిలో ఒక పెంకుటిల్లు పడిపోయింది. కడియం ఆవలో సుమారు ఎనభై ఎకరాల వరి చేలు నీట మునిగాయి. కడియపులంక పాత పువ్వుల మార్కెట్‌లో ఆంజనేయస్వామి ఆలయ షాపింగ్ కాంప్లెక్స్ గోడ కూలిందని స్థానికులు వివరించారు. సుమారు యాభై హెక్టార్లకు పైగా ఉద్యాన పంటలకు నష్టం వాటినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు హెచ్‌ఓ సుధీర్‌కుమార్ తెలిపారు. కడియం రాజా వీధిలో దాసరి సత్యనారాయణకు చెందిన పెంకుటిల్లు గోడ కూలిపోయింది. దీంతో ఆ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), ఎంపీడీఓ రత్నకుమారి పరామర్శించారు. పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను బాబు కోరారు.

‘తిరుమల’ అధినేతకు పరామర్శ



చంద్రశేఖరరావుకు నివాళులర్పిస్తున్న మోషేన్‌రాజు. చిత్రంలో నున్న తిరుమలరావు



నున్న చంద్రశేఖరరావుకు నివాళులర్పిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: తిరుమల విద్యా సంస్థల అధినేత నున్న తిరుమలరావును బుధవారం రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పరామర్శించారు. తిరుమలరావు తండ్రి ఇటీవల మృతి చెందడంతో నున్న చంద్రశేఖరరావు చిత్రపటానికి కాతేరులోని ఆయన నివాసంలో మోషేన్‌రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, పలువురు ప్రముఖులు, వైద్యులు కలసి తిరుమలరావును, ఆయన సోదరులు కృష్ణ, సురేష్‌లను పరామర్శించారు.

బాలరాజుకు..

ధవళేశ్వరం: పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీరంగం బాలరాజును ధవళేశ్వరంలో వైఎస్సార్ సీపీ రూరల్ కో–ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. శ్రీరంగం సత్యనారాయణ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేశారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావులు బాలరాజును పరామర్శించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, నాయకులు గోలి దేవకుమార్, చొల్లంగి సత్యగిరి, యాజ్ఞ వాసు, తోరాటి ప్రభాకరరావు, ముత్యాల జాన్ పాల్గొన్నారు.

10న కార్తిక వన సమారాధన

ప్రకాశంనగర్: ఈ నెల 10న శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశయన, యాత సంఘీయుల కార్తిక వన సమారాధనను దివాన్‌చెరువు వద్ద పుష్కర వనంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆహ్వాన కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో గౌడ, శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు రెడ్డి రాజు, ఆహ్వాన కమిటీ కన్వీనర్ కడలి వెంకటేశ్వరరావు, ఇతర ప్రతినిధులు గెద్దాడ హరిబాబు, మార్గాని చంటిబాబు, సూరంపూడి శ్రీహరి, బుడ్డిగ రవి, ఆర్యాపురం దేవస్థానం చైర్మన్ దుంగ మంగ తదితరులు కరప్రతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ నెల 10న సుమారు 50 వేల మందికి పైగా సంఘీయులతో కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సంఘీయులు కుటుంబ సభ్యులతో కలసి ఉల్లాసంగా గడిపేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో మూడున్నర లక్షలకు పైగా శెట్టిబలిజలు ఉన్నారని, వారంతా తమ బలాన్ని ప్రదర్శించేందుకు ఇది మంచి వేదికన్నారు. సమావేశంలో గేడి అన్నపూర్ణరాజు, కేతా నాగేశ్వరరావు, గొర్రేల రమణ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశయన, యాత కార్తిక వన సమారాధన కరప్రతాన్ని ఆవిష్కరిస్తున్న సంఘీయులు

పుస్తక పఠనంతో విజ్ఞానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. స్థానిక వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో రిలయన్స్ ఫౌండర్ చైర్మన్ ధీరూబాయ్ అంబానీ జయంతి సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను చాటే ప్రయత్నంలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా గత 11 ఏళ్లుగా సేవలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్విజ్ పోటీలతో విద్యార్థుల్లో విద్యా సామర్థ్యం పెంచుకోవచ్చన్నారు. క్విజ్ పోటీల్లో విజేతలకు డీఈవో బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిగా రూ.40 వేల విలువైన రెండు లాప్‌ట్యాప్‌లు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేల విలువైన రెండు ట్యాబ్‌లు, తృతీయ బహుమతిగా 8 మందికి సైకిళ్లను పంపిణీ చేశారు. జనరల్ నాలెడ్జిలో ప్రతిభ చూపిన 50 మందికి వాటర్ బాటిళ్లు, 300 మంది విద్యార్థులకు ఎగ్జామినేషన్ ప్యాడ్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. డీపీఆర్‌ఓ ఐ.కాశయ్య, రిలయన్స్ సంస్థ ప్రతినిధులు హెచ్‌ఆర్ హెడ్ వి.శ్రీనివాసరావు, సీఎస్‌ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీల్లో విజేతలకు సైకిళ్లు అందజేస్తున్న డీఈఓ అబ్రహం

ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి

రాజమహేంద్రవరం రూరల్: వర్షానికి పడిపోయిన వరి పనలపై రైతులు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి భీమరాజు అన్నారు. కొంతమూరు, కోలమూరు, తొర్రేడు గ్రామాల్లో వర్షాలకు మునిగిన వరి చేలను ఆయన పరిశీలించి రైతులకు తగు సలహాలిచ్చారు. మండలంలో తొర్రేడు, కాతేరు, కోలమూరు, ధవళేశ్వరం, బొమ్మూరు గ్రామాలలో 161.26 ఎకరాల్లో వరి పంట పడిపోయిందని, అలాగే రబీ నారుమళ్లు పాడైన రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు అందజేస్తామని భీమరాజు తెలిపారు. రైతులు ఎస్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పంట పొలాల్లో ఉన్న ధాన్యాన్ని బయటకు తీసుకు వచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు పీటర్, వేణుమాధవ్, వీఏఏలు నాగబాబు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



కోలమూరులో వరి పనలపై ఉప్పు ద్రావణం చల్లిస్తున్న వ్యవసాయాధికారులు

వైభవంగా ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం



కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో ఆకుల వీర్రాజు, షర్మిళారెడ్డి

ధవళేశ్వరం: స్థానిక రామపాదాల రేవు వద్ద వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. అమ్మవారిని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతి పూజ, యంత్ర ప్రతిష్ఠ అనంతరం శ్రీచక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర శిఖరం, సింహ విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం మహాన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఆహ్వాన కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వాసవీ మాత ట్రస్ట్, శ్రీవాసవి గీతా మహిళా సమాజం సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ), పందెళ్ల భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు నిరుపమానం



అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్



వైఎస్సార్ సీపీ రూరల్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



కడియంలో అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న గిరజాల బాబు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక సిటీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ నీలి ఆనంద్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షులు టీకే విశ్వేశ్వరరెడ్డి, కాటం రజనీకాంత్, డివిజన్ ఇన్‌చార్జులు ఆరే చిన్ని, దాసి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి చేశారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ కొనియాడారు. పార్టీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అహర్నిశలూ పని చేస్తోందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొప్పిసెట్టి ప్రసాద్‌బాబు (రాజమౌళి), రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, నాయకులు సుందరపల్లి అనీల్, బిల్డర్ చిన్న, పెనుమాక సునీల్, పడమట కామరాజు, సద్గుణ రామారెడ్డి పాల్గొన్నారు. బొమ్మూరులో గ్రామ వైఎస్సార్ సీపీ, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. శాటిలైట్‌సిటీలో పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఈఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది

ప్రకాశంనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అన్నారు. గోకవరం బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఆ సంఘ నాయకులు పూలమాలలు వేశారు. జిల్లా సంఘ అధ్యక్షుడు బి.జార్జి ఆంటోని, కుసుమ రాజకుమారి, నక్కా వెంకటరత్నం, విజయకుమార్, తాళ్లూరి బాబూరాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి, మురారి రవికుమార్ పాల్గొన్నారు. గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి టి.అరుణ్, తదితరులు పూలమాలలు వేశారు.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

కడియం: బీఆర్ అంబేడ్కర్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లోని దివంగత గిరజాల కృష్ణారావు కళా వేదిక వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. నాయకులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, సాపిరెడ్డి కామేష్, కుసునూరి బాబులు, కందా రాజు, సర్కార్ బాషా, పున్నమిరాజు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. పొట్టిలంకలో బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం, జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రిపబ్లికన్ పార్టీ నాయకులు నక్కా వెంకటరత్నం, నక్కా చంటిబాబు, వీరవెల్లి మహాలక్ష్మి, అంబటి రాజారత్నం, పల్లి కిరణ్ పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయంలో..

కంబాలచెరువు: స్థానిక కోటగుమ్మం వద్ద ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్లు వి.వెంకట్రాజు, ఛాయాదేవిలు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, విజయ్, వర్ధన్, సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



విద్యార్థికి స్వెట్టర్ అందజేస్తున్న ప్రశాంత్ కె.మిశ్రా

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకుని ముందుకు సాగాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రశాంత్ కె.మిశ్రా అన్నారు. బుధవారం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పే బ్యాక్ టు సొసైటీలో భాగంగా స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో 40 మంది విద్యార్థులకు స్వెట్టర్లు అందజేశారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కుంచే యశ్వంత్, ఆఫీసర్స్ అసోసియేషన్ బీజీఎస్ శ్రీనివాస్, స్టాఫ్ యూనియన్ డీజీఎస్ పాపారావు పాల్గొన్నారు.